ప్రజాశక్తి
శనివారం 29 నవంబర్ 2025
5
విజయనగరం

పింఛన్ల పునఃపరిశీలన పూర్తి చేయాలి

విజయనగరంకోట : ఎన్‌టిఆర్ భరోసా వికలాంగ పింఛన్ల రీ ఎసెస్‌మెంట్‌ను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రీ ఎసెస్మెంట్‌లో జాప్యం జరుగుతుండటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరం రీ ఎసెస్‌మెంట్ కార్యక్రమంపై తమ ఛాంబర్లో సంబంధిత అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 2068 మందికి రీ ఎసెస్మెంట్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇఎన్‌టి విభాగానికి సంబంధించి 2610 మందికి రీ వెరిఫికేషన్ జరిగినప్పటికీ, వినికిడికి సంబంధించి బేరా టెస్టింగ్ నిర్వహించాల్సి ఉందన్నారు. వచ్చేనెల 22 లోగా వీరికి పరీక్షలు పూర్తిచేసి, అర్హుల తుది జాబితాను తయారు చేయాలని ఆదేశించారు. దీనికోసం ఐదు రోజుల్లో సమగ్ర ప్రణాళికను తయారు చేయాలని, అదనపు సిబ్బందిని వినియోగించి పని పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి, డిఎంఅండ్‌హెచ్‌ఒ జీవనరాణి, డిసిహెచ్‌ఎస్ పద్మశ్రీ రాణి, డిఎల్‌డిఒ రోజారాణి, జిజిహెచ్ సూపరింటిండెంట్ శ్రీధర్, ఇఎన్‌టి విభాగాధిపతి దక్షిణామూర్తి పాల్గొన్నారు.

ఎస్.కోట యథాతథమే

- మెంటాడపై సాహసించని ప్రభుత్వం
- మారని విజయనగరం, మన్యం జిల్లాల స్థితి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎస్.కోట నియోజకవర్గం విజయనగరం జిల్లాలో యథాతథంగా కొనసాగనుంది. మెంటాడ మండలాన్ని మన్యం జిల్లా పరిధిలోకి మార్చాలన్న ఆలోచన విషయంలో ప్రభుత్వం సాహసించలేదు. దీంతో, మన జిల్లా భౌగోళిక స్థితిలో మార్పులు చేర్పులు లేనట్టుగా స్పష్టమౌతోంది. కొత్తగా మూడు జిల్లాలు, మూడు రెవెన్యూ డివిజన్లకు రెండు రోజుల క్రితం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసందే. ఇందులో భాగంగా కొన్ని మండలాలను కూడా పక్కపక్క జిల్లాలకు మార్పులు చేర్పులు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయిం చింది. ఇందులో ఎస్.కోట నియోజక వర్గం గుర్తించి ఎలాంటి చర్చ లేకపోవడంతో విశాఖ జిల్లాలోకి చేరుస్తారన్న చర్చకు తెరపడినట్టుగా అయ్యింది. మరోవైపు జిల్లాల పునర్విభజన సమయంలో మెంటాడ మండలాన్ని పార్వతీపురం మన్యంలోకి మార్పుచేయడంతో మెంటాడ వాసులు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో, మండలాన్ని విజయనగరం జిల్లాలో ఉంచినప్పటికీ, అస్లెంబ్లీ పరిధి మాత్రం సాలూరు నియోజకవర్గంలో ఉండిపోయింది. తాజాగా జిల్లాల పునర్విభజన కసరత్తు జరిగిన సమయంలో జిల్లాలో పరిధిలోగల మండలాలన్నీ అదే జిల్లాలో ఉండే విధంగా చూస్తామనడం మెంటాడ మండలంలో ఆందోళనలు జరిగాయి. యథాతథంగా కొనసాగించాలని, వీలైనంత వరకు తమను సాలూరు నియోజకవర్గం నుంచి తప్పించి, గజపతినగరం నియోజకవర్గం పరిధిలో ఉంచాలనే డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ఇదే విషయమై ఇటీవల కలెక్టరేట్ వద్ద ఆందోళన కూడా చేపట్టారు. పునర్విభజన నోటిఫికేషన్‌లో ఈ విషయం ప్రస్తావన లేకపోవడంతో మెంటాడ మండల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, సాలూరు నుంచి తప్పించి, గజపతినగరం నియోజకవర్గం పరిధిలోకి మార్చాలనే డిమాండ్‌తో ఉన్నారు. మరోవైపు బొబ్బిలి నియోజకవర్గాన్ని మన్యం చేర్చాలంటూ ఇటీవల కాలంలో కొన్ని రాజకీయ పార్టీలు ప్రకటనలు చేశాయి. అటు మన్యం జిల్లా పరిధిలోని పాలకొండను శ్రీకాకుళంలో చేర్చాలని, లేదంటే పాలకొండ కేంద్రంగా ప్రత్యేక జిల్లాగా చేయాలంటూ ఓ పార్టీ ప్రకటన చేసింది. కానీ, అటువంటి పరిణామాలేవీ చోటు చేసుకోలేదు. దీంతో, విజయనగరం, పార్వతీపురం జిల్లాలో భౌగోళికంగా యథాతథంగా ఉండనున్నాయి.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలో తీర్మానం • 30 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభ డిమాండ్ చేసింది. ఎన్ఇపిని రద్దు చేసే వరకు పోరాడుతామని తీర్మానించింది. స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్ లో రెండు రోజులుగా జరిగిన ఎస్‌ఎఫ్ ఐ 33వ జిల్లా మహాసభలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. విద్యా రంగ అభివృద్ధి కోసం, ప్రభుత్వ విద్య బలోపేతానికి కార్యాచరణపై సుధీర్ఘంగా చర్చించి పలు తీర్మానాలు చేశారు ఎన్ఇపిని రద్దు చేయాలని, రాష్ట్రంలోను, జిల్లాలోనూ మూసేసిన పాఠశాలలను తెరిపించాలని, మెడికల్ కాలేజీలు,సెంట్రల్ యూనివర్సిటీలు నిర్మాణాలు వేగవంతం చేయాలని, సంక్షేమ వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని తీర్మానం చేశారు. విద్యా సంస్థలకు వెళ్లేందుకు విద్యార్థి సంఘాలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని, విద్యార్థినుల వసతి గృహాల్లో సానిటరీ సరఫరా చేయాలని, అర్హులైన విద్యార్థులందరికీ తల్లికి వందనం ఇవ్వాలని, ప్రతి మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని, రాజాం,గజపతినగరం,విజయనగరం ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వంత భవనాలు ఏర్పాటు చేయాలని,
నెల్లిమర్ల ,బొబ్బిలి లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని తీర్మానించారు. పెండింగ్ లో ఉన్న 6,800 కోట్లు స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలని, విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, జీవో 77 ను రద్దు చేసి పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, కార్పోరేట్ ఫీజుల దోపిడీ ఆపాలని, ఫీజులు నియంత్రణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నూతన కమిటీ సభ్యులు

జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా చినబాబు,రాము

మహాసభలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 30 మందితో నూతన జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ ప్రతిపాదన చేయగా మహాసభ ఆమోదించింది. అనంతరం నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా వి.చినబాబు, కార్యదర్శిగా డి.రాము, ఉపాధ్యక్షులుగా ఎం.వెంకీ, అర్.శిరీషా, కె.జగదీష్, కె.రమేష్, సహాయ కార్యదర్శులుగా పి.రమేష్, ఈ.వంశీ, వి.భారతి, ఎస్.సోమేష్, ఆహ్వానితులుగా రమణ, రూప, జిల్లా కమిటీ సభ్యులుగా జయ, ఎర్రమ్మ, సూరిబాబు, నాని, శ్రీలత, మధు, జగదీష్, తేజ,కిరణ్, రాజశేఖర్, తేజ, కిరణ్, మణి, చైతన్య, రత్నా, గౌరీ, లక్ష్మి, సాయి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రానున్న కాలంలో జిల్లాలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం, విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం, సంఘాన్ని మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలో పేద బడుగు , బలహీన వర్గాలు విద్యార్థులకు అండగా ఉంటూ ప్రభుత్వ విద్యను అందించేందుకు ఎదురయ్యే ఆటంకాలు అధిగమించేందుకు కలిసిగట్టుగా పనిచేస్తామని తెలిపారు.

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

ఇంటి పన్నులు తగ్గించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని 45,46వ వార్డు పరిధి ఎల్‌బిజి నగర్ లో నివాసం ఉంటున్న పేదలకు తాగునీటి కుళాయిలు వేయాలని, ఇంటి పన్నులు తగ్గించాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశాఉ. శుక్రవారం 55 వ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసంర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నెంబర్ 18 ప్రకారం సంవత్సరానికి రూ .54 మాత్రమే ఇంటి పన్ను వేయాలని, కానీ దాన్ని అమలు చేయడం లేదన్నారు. తక్షణమే అమలు చేయాలని, రోడ్లు కాలువలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు అపార్ట్ మెంట్‌ల వాడుక నీటిని కాలనీలోకి వదిలేస్తున్నందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్ని పిర్యాదులు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ఈ సమస్యలనీ పరిష్కరించాలని కోరారు. కార్యక్రమం లో సిపిఎం నాయకులు పి. రమ ణమ్మ, రంభ శ్రీనివాసరావు, పుణ్యవతి ఎల్ బి జి నగర్ పేదలు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకంగా మెగా పిటిఎం

కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

డిసెంబర్ 5న జరగబోవు తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలను (మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్) స్ఫూర్తిదాయకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి కోరారు. పిటిఎంల నిర్వహణపై విద్యాశాఖాధికారులతో కలెక్టరేట్లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహిస్తున్న మూడవ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగు ఈసారి కేవలం ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మాత్రమే నిర్వహిస్తామని తెలిపారు. ప్రజా ప్రతినిధులతోపాటు విద్యార్థులు తల్లిదండ్రులంతా వచ్చే విధంగా చూడాలని కోరారు.ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమం ముగించే సమయం 12 .45 గంటల వరకు నిర్వహించాల్సిన కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి తల్లిదండ్రులను ప్రజా ప్రతినిధులను ఏ విధంగా ఆహ్వానించాలి, పిల్లల అకడమిక్స్ గురించి తల్లిదండ్రులతో ఏ విధముగా చర్చించాలి అనే అంశాలపైనా సూచనలు చేశారు. స్వాగత ఉపన్యాసం తరువాత, మా తెలుగు తల్లికి... గీతాన్ని పాడించాలని, తరువాత విద్యార్థులతో శతక పద్యం గాని, కథ గానీ చెప్పించాలని సూచించారు. సమావేశంలో డిఇఒ యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ ఎ.రామారావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి శ్రీ, సోషల్ వెల్ఫేర్ డిడి ఎం.అన్నపూర్ణమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒ లు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

డిజిటల్ అసిస్టెంట్‌పై దాడి

ప్రజాశక్తి-వంగర

మండలంలోని శ్రీహరిపురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న బోనెల మహేష్ పై అదే గ్రామానికి చెందిన శెట్టి అప్పలనాయుడు శుక్రవారం దాడి చేశాడు. ఈ ఘటనకు సంబంధించి బాధితుడు మహేష్, పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం..శ్రీహరిపురం సచివాలయంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగి డిజిటల్ అసిస్టెంట్ బోనెల మహేష్ తన విధులకు ఉదయం వచ్చి ఫీల్డ్‌కు వెళ్లి తిరిగి మధ్యాహ్నం సమయంలో సచివాలయానికి చేరుకున్నాడు. అయితే ఆ సమయంలో శెట్టి అప్పలనాయుడు సచివాలయం వద్దకు వెళ్లి ఎన్ని రోజులు సర్టిఫికెట్లు కోసం తిప్పుతావు అంటూ చొక్కా పట్టుకొని బయటకు లాగేసి కొట్టాడు. ఆ సమయంలో విధుల్లో ఉన్న సచివాలయ తోటి ఉద్యోగులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ ఘటనపై బాధితుడు మహేష్ వంగర పోలీస్ స్టేషన్లో శ్రీహరిపురం సచివాలయ ఉద్యోగులతో కలిసి ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శెట్టి అప్పలనాయుడు ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా మహిళా పోలీసు స్టేషను 2025లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు విజయనగరానికి చెందిన వడిమజ్జి రవి (49)కి విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె..నాగమణి 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.3వేలు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.50 వేలు మంజూరు చేస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారని ఎస్పి ఎఆర్. దామోదర్ తెలిపారు.నగరంలోని అద్దెపల్లివారి వీధిలో నివాసం ఉంటున్న వడిమజ్జి రవి అదే వీధికి చెందిన ఒక బాలిక (13)ను ఇంట్లోకి పిలిచి ఎవరూలేని సమయంలో లైంగిక దాడికి పాల్పడినట్లుగా మైనరు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి మహిళా పోలీసు స్టేషను ఎస్ఐ బి. రేవతి పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.కేసు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఆదర్శనీయులు జ్యోతిరావు పూలే

కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మహాత్మా జ్యోతిభా పూలే అందరికీ ఆదర్శనీయులని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి కొనియాడారు. పూలే 135వ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ సమీపంలోని జ్యోతిభా పూలే విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం. పూలే, సావిత్రిబాయి విగ్రహాలకు సైతం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతికి పూలే చేసిన సేవలను కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయులని పేర్కొన్నారు. మహిళల కోసం, స్త్రీవిద్య కోసం విశేషంగా కృషి చేశారని అన్నారు. సమాజంలో సమానత్వాన్ని పెంపొందించేందుకు తమవంత ప్రయత్నాలు చేశారని, ఆయన అడుగుజాడలు అందరికీ ఆదర్శనీయమని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా బిసి సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ, సంక్షేమాధికారులు, వివిధ బిసి సంఘాల నాయకులు ముద్దాడ మధు, కొల్లి అప్పలనాయుడు, పొట్నూరు వెంకటరాజు, చోడి ఆదినారాయణ, కిల్లంపల్లి ఆచారి, ఎలిగాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

మహిళా విద్యా ప్రదాత పూలే

విజయనగరం టౌన్ : దేశంలో మహిళలకు విద్యనందించేందుకు, వితంతు వివాహాలు చేసుకున్న మహిళల అభివృద్ధికి నిరంతరం పాటుపడిన, మహిళా పక్ష పాతి మహాత్మ జ్యోతి రావు పూలే అని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా కనపాకలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ మాట్లాడుతూ తన భార్యకు చదువు చెప్పి, సావిత్రి బాయి పూలే ద్వారా విద్యావ్యాప్తికి కృషి చేసిన మహనీయుడని అన్నారు. వితంతువులకు వివాహాలు జరిపించడం, వారి బాగోగులు చూసుకోవడం, బాలికల కోసం సేవాసదన్ నిర్మించడం చేశారని అన్నారు. పూలే ఆశయ సాధన కోసం ఐద్వా నిరంతరం కషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు పుణ్యవతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : నాయుడువలస పాఠశాలలో హెచ్‌ఎం వేణు ఆధ్వర్యంలో సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే చిత్రపటానికి కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు పూలమాల వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీశ్వరి, కృష్ణం నాయుడు, రమణ పాల్గొన్నారు.

పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను విరమించుకోవాలి

సంతకాల సేకరణలో కోలగట్ల

ప్రజాశకి-విజయనగరం టౌన్

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు పోరాటం ఆగేది మీదని మాజీ డిప్యూటీ స్పీకర్, వైసిపి నాయకులు కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు.శుక్రవారం గంటస్తంభం ప్రాంతంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు విద్యా, వైద్యం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో నాటి వైసిపి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిందన్నారు. వాటిని నేడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసి పేదలకు వైద్య విద్య, వైద్యం దూరం చేసి, ప్రైవేటు వారికి లాభాలు వచ్చే విధంగా చేయడం దారుణమన్నారు. పీపీపీ పద్ధతి వల్లఉచిత వైద్యం ఖరీదుగా మారుతుందన్నారు. ట్టి పరిస్థితిలో వైద్య,విద్యా,వైద్యం పేదలకు అందుబాటులో ఉండాలంటే ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు ఉండాలని అన్నారు.కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి పట్టణ అధ్యక్షులు ఎ.వేణు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న మేయర్ విజయలక్ష్మి

సగటు వేతనం పెంచాలి

ఉపాధి హామీపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో మహాత్మా ఉపాధి హామీ కింద పని చేస్తున్న వేతనదారులకు సగటు వేతనం పెరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి ఆదేశించారు. పథకం అమలుపై శుక్రవారం ఉదయం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో సరాసరి వేతనం తక్కువగా నమోదు చేసిన మెంటాడ, వేపాడ, మెరకముడిదాం, తెర్లాం మండలాల ఎపిడిలు, ఎంపిడిఒలు, ఎపిఒలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరాసరి వేతనం పెంచడానికి వీలుగా కూలీల సంఖ్య ఎక్కువగా అవసరమయ్యే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యంగా కంపోస్ట్ పిట్‌లు (ఒక్కోదానికి ఇద్దరు చొప్పున), ఫారం పాండ్‌లు (ఒక్కోదానికి 13 నుంచి 15 మంది చొప్పున) వంటి పనులకు ప్రాధాన్యమిస్తూ, ఎక్కువ మంది శ్రామికులను పనిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. వేతనదారులకు పని కల్పించడంలో జిల్లాలో ఈ వారం వెనుకబడిన వంగర, రామభద్రపురం, పూసపాటిరేగ, వేపాడ, చీపురుపల్లి, గంట్యాడ మండలాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వంద రోజులు పని కల్పన లక్ష్యంగా, 81-99 రోజులు మధ్య, 71-80 రోజులు మధ్య పని చేసిన కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. నెల్లిమర్ల, చీపురుపల్లి నియోజక వర్గాలకు సంబంధించిన మినీ గోకులాల అంచనాలను త్వరితగతిన తయారు చేసి కార్యాలయానికి పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, ఎంపిడివోలు, ఏపీడీలు అధికారులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం అభివృద్ధికి అడ్డంకులు తొలగాలి

ఎమ్‌పి శ్రీభరత్

క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎమ్‌పి శ్రీభరత్

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ క్రీడ మైదానం అభివృద్ధి కావాలంటే కొన్ని అడ్డంకులను సరిచేయాలని విశాఖ ఎమ్‌పి శ్రీభరత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ క్రీడా మైదానాన్ని ఆయన పరిశీలించారు. ముందుగా క్రీడా మైదానానికి ఉన్న అడ్డంకులను తొలగించి, ఆ తరువాత అందరికీ వినియోగంలోకి వచ్చేలా తయారు చేస్తానని ఆయన హామీనిచ్చారు. దీనికి అందరి సహకారం కావాలని కోరారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, బిజెపి నాయకుడు సిహెచ్ ఆర్‌కె ప్రసాద్, బొబ్బిలి రామకృష్ణ, దొడ్డి సూర్యారావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీష్ పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో ఎఐఎఫ్‌టియు రాష్ట్ర మహాసభ

విజయనగరం టౌన్ : డిసెంబర్ 8, 9 తేదీల్లో గుంటూరులో జరిగే అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (న్యూ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం విజయనగరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'దేశంలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టి, సామ్రాజ్య వాద, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ప్రభుత్వ విధానాలను తీసుకొస్తున్నా రన్నారు. రైతుల సాగుభూముల్ని, అడవులను బలవంతంగా లాక్కుని కంపెనీలకు స్వాధీనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతిఘటిస్తున్న రైతాంగం, ఆదివాసీలపై నిర్బంధం ప్రయోగిస్తున్నారని అన్నారు. ఆందోళన చేస్తున్న రైతులను, గిరిజన, మత్స్యకారులను అణచివేస్తున్నారని అన్నారు. యాజమానుల లాభాపేక్షను బలవరుస్తూ కార్మిక భద్రతను గాలికొదిలేస్తూ-కేంద్ర పాలకులు తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీ విజయ దుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావు, ఆటో యూనియన్ నాయకులు సిహెచ్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్‌పై థర్డ్ పార్టీ : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

లింగ నిర్ధారణ ఒక పెద్ద నేరమని, గర్భ నిర్ధారణ స్కానింగ్ లపై థర్డ్ పార్టీని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పి.సి.పి.ఎన్.డి.టి చట్టం అమలుపై కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లింగ నిర్ధారణ వివరాలు బయటకు వెళ్లకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయంపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. స్కానింగ్ కేంద్రాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు థర్డ్ పార్టీ మానిటరింగ్ కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. పుట్టిన శిశువుల నిష్పత్తులనను ప్రతి సంస్థ సక్రమంగా నమోదు చేయాలని, కార్యాలయం ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరం లేని సందర్భాల్లో కేసులను రిఫర్ చేస్తే సహించబోమని కలెక్టర్ హెచ్చరించారు. డెలివరీ ఫెసిలిటీ కలిగిన పిహెచ్‌సిలు, సిహెచ్‌సిల జాబితాను వెంటనే సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో కొత్త స్కానింగ్ సెంటర్ల స్థాపనకు వచ్చిన ఐదు దరఖాస్తులు, రెన్యువల్ కోసం వచ్చిన ఒక దరఖాస్తు, స్కానింగ్ మిషన్ల తొలగింపుకు మూడు దరఖాస్తులు, స్కాన్ సెంటర్ తొలగింపుకు రెండు దరఖాస్తులను ఆమోదించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్. జీవనరాణి, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ కె. రాణి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సూర్యనారాయణ, నేచర్ ఎన్జీవో ప్రతినిధి సిహెచ్. చంద్రశేఖర్, ఆర్డీవో ప్రతినిధి శ్రీనివాస్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

సంగీత కళాశాల పూర్వ వైభవానికి ఎమ్‌పి కలిశెట్టి కృషి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రసిద్ధి చెందిన విజయనగరం మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల పూర్వ వైభవానికి ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు కషిని ప్రారంభించారు. ఎందరెందరో మామూలు మనుషులను మహామహులుగా తీర్చిదిద్దిన కళాశాలకు మరిన్ని హంగులు అద్దటానికి ఎమ్‌పి కలిశెట్టి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి నిధుల కోసం వినతి అందించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేయటంతో సంగీత కళాశాల పరిపుష్టికి ఎంపి చూపిన చొరవకు కళాశాల పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. 2019లో కళాశాల శత జయంతి జరిగిన సందర్భంగా కళాశాల మరమ్మత్తులు జరిగాయి. ఆరున్నరేళ్ల తరువాత మళ్లీ తరగతి గదుల్లో కొన్ని మరమ్మత్తులు చేయవలసి వుంది. కళా వేదికను ఆధునీకరించవలసి వుంది. దీనికి తోడు కళాశాల మైదానంలో చినుకు పడితే బురదమయం కావటంతో సాధన చేసే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కళాశాలకు వచ్చిన క్రమంలోను, ఇక్కడ ప్రదర్శనలు చేసే సందర్భంలో విద్వాంసులు విడిది చేయటానికి, పూర్వ విద్యార్థులు సమావేశాలు నిర్వహించుకోవటానికి ఒక భవనం ఏర్పాటు చేయాలని ఎం.పి కలిశెట్టి దృష్టికి పూర్వ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి బూరాడ శ్రీనివాసరావు తీసుకువెళ్లారు. కళాశాలలోని మౌళిక సదుపాయాలపై విజయనగర ఉత్సవాలు సందర్భంగా ఎం.పి కలిశెట్టి కళాశాలకు వెళ్లి సమస్యలు తెలుసు కున్నారు. వీటిపై స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతి పత్రం అందించారు. కోటి యాభై లక్షలు వరకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేయటంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లింగ సమానత్వం పాటించాలి

కంటోన్మెంట్ : ప్రతిఒక్కరూ లింగ సమానత్వాన్ని పాటించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి కోరారు. లింగ సమానత్వమే లక్ష్యంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నూతన చైతన్యం (నయీ చేతన్) 4.0 కార్యక్రమం ఇటీవల ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ తమ ఛాంబర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.జీవనరాణి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాణి, డాక్టర్ పద్మశ్రీరాణి, డిఎల్‌డిఒ రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పేదలకు అండగా సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి-బొబ్బిలి

పేదలకు సిఎం సహాయ నిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో శుక్రవారం సిఎం సహాయనిధి కింద 25 మందికి రూ.17,10,669 విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కొందరు పేద, మధ్యతరగతి కుటుంబాల వారు అనారోగ్య సమస్యలతో ఆర్థికంగా నష్టపోతున్నారని, అటువంటి వారికి పార్టీలకు అతీతంగా సిఎం సహాయనిధి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదుకుంటున్నారన్నారు. రాజకీయాలు ఎన్నికల వరకే తప్ప కష్టంలో ఎవరున్నా సహాయపడటానికి ముందుంటానని, ఆ విషయంలో రాజకీయ ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్స్ ను పరిశీలించి, ప్రమాదానికి కారణాలు గుర్తించి, నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లాలో 25 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు ప్రమాద కేసులను త్వరగా పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నమోదు చేసే ఐరాడ్ యాప్ గురించి సుదీర్ఘంగా చర్చించారు. యాప్ లో పలు మార్పులు చేయాల్సి ఉందని, దీనికోసం ప్రభుత్వానికి లేఖ రాయాలని నిర్ణయించారు. కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు మాట్లాడుతూ ఎత్తుబ్రిడ్జి డౌన్ నుంచి తోటపాలెం వెళ్లే రహదారిలో నాలుగు కళాశాలలు ఉన్నాయని, విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, అలాగే రైతు బజారు దగ్గర కూడా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని కోరుతూ, వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నల్లనయ్యను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ సౌమ్యలత, ఆర్అండ్ బి ఎస్ఇ కాంతిమతి, డిటిసి మణికుమార్, డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ జీవనరాణి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీరాణి, పిఆర్ ఎస్ఇ శ్రీనివాసరావు, ఐరాడ్ మేనేజర్ శ్రీధర్, ఇతర అధికారులు, వివిధ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అంచనా బడ్జెట్ ఆమోదం

ప్రజాశక్తి- మెరకముడిదాం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కృష్ణవేణి అధ్యక్షతన శుక్రవారం 2025-26కు సంబంధించిన అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ జి.భాస్కరరావు బడ్జెట్ను ప్రవేశపెట్టగా, ఎఒ సుధాకర్ పట్నాయక్ సవివరంగా వివరించారు. అంచనా బడ్జెట్లో ప్రారంభ నిల్వ రూ.129,86,359, రాబడులు రూ.9198,86,545 మొత్తం రూ.9328,72,904గా చూపించారు. ఖర్చులు రూ.9195,85,096, అంచనా నిల్వ రూ.132,87,808గా చూపించారు. సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ బడ్జెట్ సమావేశంలో వైస్ ఎంపిపిలు తలచుట్ల హరిబాబు, పి.పార్వతి, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నేరాల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-చీపురుపల్లి

సమాజంలో జరుగుతున్న నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఐ జి.శంకర్రావు కోరారు. శుక్రవారం చీపురుపల్లిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకించి మహిళలపై జరుగుతున్న దాడుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్ నేరాలు పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎటువంటి సైబర్ నేరాలకు చిక్కకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎల్.దామోదర్ రావు, ప్రిన్సిపల్ రాణి శ్రీ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళిత అధికారులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-వేపాడ

టిడిపి కూటమి ప్రభుత్వం దళిత అధికారులపై కక్ష సాధింపులకు దిగడం అన్యాయమని దళిత ఉద్యమ నేత ఆతవ ఉదయ భాస్కర్ విమర్శించారు. మండలంలోని ఆతవ గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ నిజాయితీగా తమ విధులను నిర్వర్తిస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మంచి జరగాలని కోరుకునే అధికారులపై కక్షగట్టి రాజకీయ వేధింపులకు దిగడం అన్యాయమన్నారు. పెత్తందారీ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. దళిత అధికారులపై ప్రభుత్వ ధోరణి మార్చుకోవాలన్నారు. లేకుంటే వారికి మద్దతుగా ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

మండల సమాఖ్యను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండల సమాఖ్యను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని డిఆర్డిఎ ప్రాజెక్టు మేనేజర్ ఎ.చిరంజీవి అన్నారు. శుక్రవారం మూడు రోజులుగా నెల్లిమర్ల వెలుగు కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలు తన రూపాన్ని కోల్పోకుండా, నిర్వీర్యం కాకుండా బలంగా ఉండాలంటే సంస్థాగత నిర్మాణం బాగుండాలన్నారు. రాబోయే ఐదేళ్లలో మహిళా సంఘాలు మరింత అభివృద్ధి చెందడానికి, ఆర్థికంగా, సామాజికంగా బలపడటానికి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సంఘ సభ్యులతోనే తయారు చేయించాలన్నారు. ఈ ప్రణాళిక ఆధారంగా గ్రామ, మండల సమాఖ్యలకు కావలసిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే అవకాశం ఉందన్నారు. శిక్షణలో ఎపిఎంలు విశ్వేశ్వరరావు, సురేష్, పద్మ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులుగా లక్ష్మణరావు

ప్రజాశక్తి - గజపతినగరం

వైసిపి యువజన విభాగం గజపతినగరం మండల అధ్యక్షులుగా రంగుపురం సర్పంచ్ కర్రి లక్ష్మణరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, పెద్ద సంఖ్యలో యువతను పార్టీలో చేర్చేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఒబిసి సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా చిలకలపల్లి

ప్రజాశక్తి-బొబ్బిలి



ధ్రువపత్రాన్ని అందుకుంటున్న శ్రీనివాసరావు

అఖిల భారత ఒబిసి సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా చిలకలపల్లి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. విజయనగరం జెడ్పి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఆయనకు ధ్రువపత్రాన్ని జాతీయ అధ్యక్షులు వరప్రసాద్ అందించారు. ఒబిసి, బిసి కులాల సమస్యలపై పని చేస్తామని శ్రీనివాసరావు చెప్పారు.

శిథిల భవనంలోనే వైద్య సేవలు

స్లాబ్ పెచ్చులూడిపోతున్న గదిలోనే వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

భయాందోళన చెందుతున్న రోగులు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. దాదాపు 13 గ్రామాల ప్రజలకు, అందులోనూ అత్యధికంగా గిరిజనులకు వైద్య సేవలు అందిస్తోంది. ఇద్దరు వైద్యులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. అలాంటి ఆస్పత్రికి రోగులు వచ్చేందుకు భయపడుతున్నారు. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడమే అందుకు కారణం. పిహెచ్సి భవనాన్ని విశాఖపట్నం మాజీ ఎమ్పి ఎంవివిఎస్ మూర్తి నిధులతో 2011లో నిర్మించారు. ప్రస్తుతం ప్రసూతి నిరీక్షణ భవనం పూర్తిగా పాడైపోయింది. కిటికీలు, తలుపులు లేవు. ఈ గదిలో గర్భిణులు వేచి ఉండాలంటే ఇబ్బందే. తప్పని పరిస్థితుల్లో ఈ గదిలోనే ఉండాల్సి వస్తోంది. గర్భిణులకు శస్త్రచికిత్సలు చేసే గది స్లాబ్ పెచ్చులూడిపోతోంది. కిటికీలు కూడా లేవు. రక్త పరీక్షల కోసం ఏర్పాటు చేసిన గదికి టైల్స్ పూర్తిగా ఊడిపోయాయి. కిటికీలు, తలుపులు లేకుండా ఉంది.

సేవల విషయంలో లోటు లేకున్నా, పిహెచ్సి భవన శిథిలావస్థకు చేరడంతో రోగులు, గర్భిణులు ఆస్పత్రికి వచ్చేందుకు భయపడుతున్నారు. ఈ ఆస్పత్రి దుస్థితిపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి స్థానికులు, గతంలో పనిచేసిన వైద్యాధికారులు తెలియజేశారు. అయినప్పటికీ ఏ విధమైన చర్యలూ లేవు. పేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంచుతామంటూ కూటమి ప్రభుత్వం నిత్యం పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడమే తప్ప మారుమూల ప్రాంతమైన వేపాడ పిహెచ్సి భవనం పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడేందుకు చర్యలు మాత్రం తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి నిధులు మంజూరు చేసి, మండలంలో ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భవనం సిద్ధం.. ప్రారంభమే ఆలస్యం

ఏళ్ల తరబడి వినియోగంలోకి రాని పంచాయతీ కార్యాలయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయ పరిధిలో ఉన్న అరిగిపాలెంలో గత ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో పంచాయతీ భవనం నిర్మించింది. భవనం పనులు పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పరాయి భవనాల్లో విధులు నిర్వహిస్తూ కాలం గడుపుతున్నారు. ఈ విషయం పలుమార్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో సర్పంచి, ఎంపిటిసి పంచాయతీ భవనాన్ని ప్రారంభించండి మహాప్రభో.. అంటూ మొరపెట్టుకున్నా, ప్రారంభానికి నోచుకోలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేపాడ మండల కేంద్రంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏళ్ల తరబడి పంచాయతీ భవనం నిర్మించి ప్రారంభానికి నోచుకోలేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే.. ముకుందపురం, కరకవలస గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పనులు ప్రారంభోత్సవానికి, శంకుస్థాపనలకు విశాఖ ఎమ్పి శ్రీభరత్ వస్తుండటంతో అదే రోజు అరిగిపాలెం పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి షెడ్యూల్లో చేర్చాలని పిఆర్ జెఇని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు షెడ్యూల్లో ఈ నెల 21న ప్రారంభానికి చేర్చారు. చివరి క్షణంలో అరిగిపాలెం పంచాయతీ భవన ప్రారంభాన్ని షెడ్యూల్ నుంచి తప్పించారు. ఎట్టకేలకు పంచాయతీ భవనం ప్రారంభమవుతుందని గ్రామస్తులు ఎంతో ఆశగా ఎదురు చూశారు. వైసిపి నాయకుల మాదిరిగా కూటమి నాయకులు కూడా భవనం ప్రారంభానికి అడ్డుతగులు తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించి, వినియోగంలోకి తేవాలని అరిగిపాలెం పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పంచాయతీ భవనం

వాడీవేడిగా మండల సమావేశం

పలు సమస్యలపై నిలదీత ● 'రైతన్నా మీకోసం' కమిటీలపై సర్పంచుల ఆగ్రహం

సమస్యలపై నిలదీస్తున్న చింతాడ సర్పంచ్ సుబ్రమణ్యం

ప్రజాశక్తి - జామి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపిపి సబ్బవరపు అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అగ్రహారం భూసమస్యతోపాటు జామి శ్మశానం, మ్యుటేషన్ల పరిష్కారం కావడం లేదని సభ్యులు అధికారులను నిలదీశారు. జెడ్పిటిసి సభ్యులు గొర్లె సరయు మాట్లాడుతూ జామి శ్మశానవాటిక అభివృద్ధి విషయంలో అధికారులు, హైవే కాంట్రాక్టర్ కలిసిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్ఛార్జి తహశీల్దార్ సత్యనారాయణ మూర్తి స్పందించి వారంలో హైవే ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జామి ఎంపిటిసి వాక సుధాకర్ మాట్లాడుతూ అగ్రహారం భూ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చింతాడ సర్పంచ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ చాలా కాలంగా మ్యుటేషన్ సమస్య పరిష్కారం కాలేదని రెవెన్యూ అధికారులను నిలదీశారు. విఆర్ఒలతో సమావేశం ఏర్పాటు చేసి, దిశా నిర్దేశం చేయాలని డిమాండ్ చేశారు. జామి గ్రామంలో ప్రవహిస్తున్న జెఎ ఛానల్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఏడాదిగా ఇళ్లు మంజూరు కావడం లేదని, చనిపోయి సంవత్సరం గడుస్తున్నా పింఛను ఇవ్వడం లేదని సభ్యులు ఏకరువు పెట్టారు. ఆస్పత్రి, హౌసింగ్ సమస్యలపైనా నిలదీశారు.

సర్పంచులకు తెలియకుండా, గ్రామాల్లో ఆదర్శ రైతుల ఎంపిక, కమిటీలు ఏర్పాటు ఎలా చేశారంటూ సర్పంచులు నిలదీశారు. సర్పంచులు సూచించిన పేర్లను నమోదు చేయాలని, ఏకపక్షంగా వేసిన కమిటీలు రద్దు చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన సిబ్బంది ఎంపిక కూడా టిడిపి నాయకులు చెప్పిన పేర్లు నమోదు చేశారని ఆరోపించారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ రాజు, అన్ని మండల శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి- పూసపాటిరేగ

రైతులకు న్యాయమైన ధర అందించాలనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. శుక్రవారం మండలంలోని అల్లాడి పాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అన్నారు. అల్లాడపాలెంలో ఏర్పాటు చేసిన ఈ ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా ప్రభుత్వానికి ధాన్యం విక్రయించవచ్చునారు. ఎంఎస్ పి హామీ, మధ్యవర్తులను పూర్తిగా తొలగించడం, రైతులకు పారదర్శక సేవలు అందించడం ప్రధాన లక్ష్యమన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జలపాటి శివ, పతివాడ శ్రీను, బాషి దుర్గ, జమ రాజు తో పాటు రైతులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : మండలంలోని కమ్మవలసలో రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం ఎఫ్పిఒ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ పి.వసుంధర దేవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఒ శ్యామసుందర్ , వార్డు మెంబర్ మార్పిని గౌరి, గేదెల శంకరరావు, కర్రి కృష్ణమూర్తి, అల్లు దళినాయుడు, జనార్ధన, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, విఎఎ హైమ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

కాలువలో పూడిక తీస్తున్న డిఎల్డిఒ హేమసుందర్

పరిశుభ్రత, నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

డిఎల్డిఒ కె.హేమసుందర్

ప్రజాశక్తి-చీపురుపల్లి

గ్రామాల వారీగా పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని డిఎల్డిఒ కె.హేమసుందర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం గ్రామ సందర్శనలో భాగంగా చీపురుపల్లి మండలంలోని దేవరపు పొదిలం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న పారిశుధ్య కార్యక్రమంపై దృష్టిసారించి పేరుకుపోయిన చెత్త నిల్వలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టిన నీటిని మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త సేకరణ కేంద్రాల్లో చెత్తలను నిల్వ చేయాలన్నారు. వాట్సాప్ మనమిత్ర ద్వారా ప్రజలు అవసరమైన ప్రభుత్వ సేవలను 9552300009 అనే నెంబరు ద్వారా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళకుండానే వినియోగించుకునేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ సర్వే నెంబరు 38లో 70 సెంట్లు ప్రభుత్వ భూమిలో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేశారు. ఆ భూమి ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించడంతో ఆ గోడకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని వెల్దాం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ ఎన్.నాగభూషణరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు పట్టికలు తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ

గజపతినగరం.. సైకిల్‌యాత్రలో పాల్గొన్న నాయకులు, పోలీసులు, యువత, విద్యార్థులు

డ్రగ్స్ వద్దు బ్రో

కొనసాగుతున్న అభ్యుదయం సైకిల్‌యాత్ర

ప్రజాశక్తి-గజపతినగరం, దత్తిరాజేరు, రామభద్రపురం

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీసుశాఖ చేపట్టిన అభ్యుదయం సైకిల్‌యాత్ర శుక్రవారం గజపతినగరం, దత్తిరాజేరు, రామభద్రపురం మండలాల్లో సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో భారీ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, గజపతినగరం మాజీ ఎంపిపిలు గంట్యాడ శ్రీదేవి, మక్కువ శ్రీధర్, దత్తిరాజేరు జెడ్పిటిసి రాజేశ్వరి మాట్లాడారు. డ్రగ్స్ వద్దు బ్రో, సైకిల్ తొక్కు బ్రో.. అనే నినాదం విద్యార్థులతోపాటు, వారి తల్లిదండ్రుల్లో ఎంతో స్ఫూర్తిని నింపుతుందన్నారు. యుక్తవయసులో చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి మార్గాల్లో వెళ్లాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్ వినియోగం, అమ్మకాలు జరిపితే టోల్ ఫ్రీ నెంబర్లకు, పోలీసులకు సమాచారం తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో రామభద్రపురం తహశీల్దార్ అజురఫీజాన్, ఎంపిడిఒ రత్నం, ఎఒ అమరా శివ, ఎస్ఐలు కిరణ్ కుమార్ నాయుడు, మహేష్, జయంతి, రాజేష్, ప్రసాదరావు, తారకేశ్వరరావు, సాగర్‌బాబు, న్యూటన్ స్కూల్ ప్రిన్సిపల్ బడే ప్రసాద్ పాల్గొన్నారు.

సంతకవిటి : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఆర్.గోపాలరావు పిలుపునిచ్చారు. మండలంలోని అక్కరాపల్లి గ్రామంలో సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ బ్లాక్‌మెయిలింగ్, మహిళల భద్రత, స్వీయ రక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోపాలరావు మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో సైబర్ మోసాలు విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, సందేశాలను క్లిక్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, వాటికి దూరంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మెల్యే కోండ్రు

ప్రజాశక్తి-రాజాం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. రాజాం మండలం పొగిరిలో శుక్రవారం రైతన్నా.. మీకోసం కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోండ్రు మాట్లాడుతూ అన్నదాతల సాధికారత లక్ష్యంగా డిసెంబరు 2 వరకు రైతన్నా మీకోసం.' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో సమూల మార్పులు దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ, వివిధ శాఖల అధికారులు కూటమి నేతలతో కలిసి రైతన్నా.. మీకోసం కరపత్రాలను పంపిణీ చేసారు. పొగిలి గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకంపై ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్, స్థానిక టిడిపి నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీష్మ మాట్లాడుతూ రైతులకు గతంలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు రైతుల విషయంలో వైసిపి కపట ప్రేమ ప్రదర్శిస్తోందని విమర్శించారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, ఎంపిడిఒ, వ్యవసాయాధికారులు, నాయకులు కొల్లి అప్పలనాయుడు, బొత్స వాసుదేవరావు నాయుడు, సుమల వెంకట మన్మథరావు, గురువాన నారాయణరావు, పిన్నింటి మోహన రావు, కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, పాల్గొన్నారు. అనంతరం తెదేపా కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి, 30కి పైగా వినతులు స్వీకరించారు.

ఇంటింటి ప్రచారం

విజయనగరం కోట : అన్నదాత సుఖీభవ ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం విజయనగరం మండలం రాకోడు గ్రామంలో ఎఎంసి చైర్మన్ కర్రోతు వెంకట నరసింగరావు , మండల పార్టీ అధ్యక్షులు గంటాపోలి నాయుడు , రాకోడు ఎంపిటిసి సభ్యులు వేచలపు శ్రీనివాసరావు , ఎఎంసి వైస్ చైర్మన్ బొబ్బాది చంద్రునాయుడు తదితరులు ప్రచారం చేపట్టారు. వీరితో పాటు టిడిపి నాయకులు పాశి అప్పలనాయుడు ,గనివాడ రామసత్యం , చిగురుపాటి కుటుంబరావు , మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ , సచివాలయం సిబ్బంది తదితరులు లబ్ది దారులను (రైతులను) కలిసి రెండు విడతలు విడుదలైన ఆర్థిక సాయం, రైతులకు కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం, సబ్సిడీలు గురించి కరపత్రాలు అందించి వివరించారు.

గ్రామాల్లో ప్రత్యేకాధికారి పర్యటన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలో గుషిని, అలుగోలు, జోగిరాజుపేట, ఒమ్మి గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి జి.మురళీమోహన్ శుక్రవారం పర్యటించారు. సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరు, రికార్డులు తనిఖీ చేసి జోగిరాజుపేటలో ఆవాస్ సర్వేను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ ఆర్.పవన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవాస్ సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మురళీమోహన్

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న కమిషనర్ నల్లనయ్య

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అన్న క్యాంటీన్ పరిశీలించారు. రహదారులపై చెత్తాచెదారాలు నిల్వ ఉండరాదని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. నిర్ణీత సమయానికి విధులకు హాజరై పనులు ముగించుకోవాలి అని చెప్పారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్ లను చేపట్టాలన్నారు. ఆ తర్వాత 33,34 నెంబర్ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. 33వ నెంబర్ సచివాలయం అపరిశుభ్రత గా ఉండడంపై కార్యదర్శులను మందలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, స్వచ్ఛ సచివాలయంగా తీర్చిదిద్దాలని చెప్పారు.

నగరంలో పశుసంచారాన్ని నిషేధిస్తున్నాం

నగరంలో పశు సంచారాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. శుక్రవారం కార్యాలయంలో పశు పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 16 నుండి నగరంలో రహదారులు, వీధులలో పశు సంచారం ఉండరాదన్నారు. రహదారులపై పశువులు సంచరిస్తున్నట్లు గమనిస్తే తక్షణమే వాటిని స్వాధీనం చేసుకొని గోశాలలకు తరలించివేస్తామని చెప్పారు. కార్పొరేషన్ మరియు పోలీస్ శాఖల సంయుక్తంగా దాడులు చేపట్టి విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను అదుపులోకి తీసుకుంటామన్నారు. వారం రోజుల్లో పందులను ఏరి వేసే ప్రత్యేక టీం నగరానికి రానున్నదని చెప్పారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ చిన్నారావు పాల్గొన్నారు.

నైతిక విలువలతో విద్య

ప్రజాశక్తి-చీపురుపల్లి

విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న కేసలి అప్పారావు

నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించేలా కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ పూర్వ చైర్మన్ కేసలి అప్పారావు కోరారు. శుక్రవారం మండలంలోని పేరుపి గ్రామానికి చెందిన గౌర సతీష్ కుమార్ జన్మదినం సందర్భంగా స్వగ్రామంలో సర్పంచ్ కోరాడ పృథ్వీరాజ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సుధారాణి, కేసరి సోనాలి దీప్తి, గవర వెంకటరమణ చేతులమీదుగా పదో తరగతి విద్యార్థులకు సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల దశ, దిశ, వారి భవిష్యత్ అంతా పదో తరగతిపై ఆధార పడి ఉంటుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సోషల్ మీడియాకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని కోరారు.